సాక్షి
అనంతపురం
ఆదివారం । 11 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.16 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.7°/23.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తొణికిసలాడుతున్న టీబీ డ్యాం



టీబీ డ్యాం

బొమ్మనహాళ్: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి టీబీ డ్యాం నీటితో తొణికిసలాడుతోంది. జలాశయానికి వరద చేరిక కొనసాగుతోంది. శనివారం సాయంత్రానికి 40,925 క్యూసెక్కుల నీరు డ్యాంలో చేరుతోంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో ఉన్న శివమొగ్గ, పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో 10 క్రస్ట్ గేట్లు అడుగు మేర ఎత్తి నది నీటిని బయటికి వదులుతున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్ద 1,310 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

జాయింట్ కలెక్టర్‌గా హరిత



అనంతపురం అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా డి.హరితను ప్రభుత్వం నియమించింది. హరిత స్వస్థలం చిత్తూరు జిల్లా పాకాల మండలం దామలచెరువు. తిరుపతిలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో 10 తరగతి వరకూ చదివారు. క్యాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. విద్యానికేతన్‌లో బీటెక్, చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో ఎంటెక్ (సీఎస్ఈ) అభ్యసించారు. అటు తరువాత గ్రూప్–1 సాధించారు. డిప్యూటీ కలెక్టర్ హోదాలో కడప ఆర్డీఓగా, నెల్లూరు డ్వామా పీడీగా, నెల్లూరు ఆర్డీఓగా పనిచేశారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తించారు. 2018లో ప్రభుత్వం ఆమెకు ఐఏఎస్ హోదా కల్పించగా.. 2022 ఆగస్టు 4 నుంచి 2023 ఏప్రిల్ 6 వరకు నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, అదే ఏడాది ఏప్రిల్ 10 నుంచి 2024 జనవరి 28 వరకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. అలాగే, ఏపీ అర్బన్ ఫైనాన్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ఇటీవల ఆమెను కె.ఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నియమించారు. తాజాగా ఆ ఉత్తర్వులను సవరిస్తూ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేశారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగరాలి



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

అనంతపురం టవర్ క్లాక్: ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి విద్యార్థులతో ర్యాలీ అనంతరం లలిత కళాపరిషత్తులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి పెంపొందించడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. తల్లికి వందనం పేరుతో కాలుష్యాన్ని అరికట్టే చర్యలు చేపడుతూనే.. దేశాభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. దేశాన్ని విశ్వ గురువుగా నిలపడానికి ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదన్నారు. ప్రతి ఒక్కరూ పది మందికి తెలిసేలా 10 జాతీయ జెండాలు వీధుల్లో పంచాలన్నారు. బీజేపీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు కాపు రామచంద్రారెడ్డి, లలిత్ కుమార్, అశోక్ రెడ్డి, శ్రీధర్, అశోక్, రాజేష్, రత్నమయ్య, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవశభరితం.. స్వర మాధుర్యం



సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: సత్యసాయిపై భక్తిభావం చాటుతూ నిర్వహించిన స్వరమాధుర్య సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు సత్యసాయి భక్తులు శనివారం సాయంత్రం సత్యసాయి సన్నిధిలో సంగీత విభావరి నిర్వహించారు. తొలుత బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి బోధనలను వివరిస్తూ యజుర్ మందిరం నుంచి సత్యసాయి మహాసమాధి వరకు ర్యాలీ చేశారు. తర్వాత భక్తులు సంగీత కచేరీ నిర్వహించారు.

❐ అనంతపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని ఓ చిన్న రెస్టారెంటులోకి ఇటీవల కుటుంబంతో కలిసి వెళ్లి భోజనం చేశారు రామ్‌ప్రసాద్ మూర్తి. ఇంటికొచ్చిన గంటన్నరకే కడుపులో ఏదో వికారం. కొంత సమయం గడిచేసరికి వాంతులు, విరేచనాలు. ఇంకేముంది హుటాహుటిన సాయినగర్ రెండో క్రాస్‌లో డాక్టర్ దగ్గరికి పరుగో పరుగు. డాక్టరు ఫుడ్ పాయిజనింగ్ అని చెప్పారు. ఆయనిచ్చిన మాత్రలు మింగిన తర్వాతే రామ్‌ప్రసాద్ మూర్తికి కాస్త ఉపశమనం లభించింది.

❐ తాడిపత్రిలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఓ నాన్‌వెజ్ రెస్టారెంట్‌కు వెళ్లిన కృష్ణ మూర్తికీ రామ్‌ప్రసాద్ పరిస్థితే. చికెన్ తిన్న అతనికి నాలుగు గంటల తర్వాత తీవ్ర కడుపునొప్పి వచ్చింది. వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటేగానీ కుదుట పడలేదు.



నాణ్యతకు పాతర.. రోగాల జాతర!

- హోటల్ భోజనం అంటేనే హడలిపోతున్న పరిస్థితి
- ఫుడ్ పాయిజనింగ్‌తో జనం బెంబేలు
- పదే పదే నూనెలు మరిగిస్తూ ఆరోగ్యంతో చెలగాటం
- కంపుకొడుతున్న కిచెన్‌లోనే వినియోగదారులకు ఆహారం తయారీ
- జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- 126 శ్యాంపిళ్లు ల్యాబ్‌కు పంపగా 11 శ్యాంపిళ్లు ప్రమాదకరమని వెల్లడి



అనంతపురంలోని ఓ రెస్టారెంట్‌లో కవర్లలో నిల్వ ఉంచిన చికెన్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో ఫుడ్ పాయిజనింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఘుమఘుమలాడే వాసన, ఆకర్షించే రంగులతో వండివార్చిన చికెన్, మటన్, చేపలు కనిపిస్తే చాలు లొట్టలేసుకుంటూ తింటాం. బిరియానీ ప్రేమికులు ఇంకాస్త ఎక్కువ. కానీ హోటల్‌లో తిన్న పాపానికి పొద్దున్నే హాస్పిటల్ వెళ్లాల్సి వస్తోంది. చాలా ఆస్పత్రుల్లో ఇలాంటి కేసులే ఉన్నాయి. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, ఒళ్లంతా నీరసం, మనిషంతా గింగిరాలు తిరుగుతుంటే బతుకు జీవుడా అంటూ ఆస్పత్రిలో ఇన్‌పేషెంటుగా చేరితే గానీ కోలుకోలేని పరిస్థితి. హోటల్ బిల్లు ఒక షాక్ అయితే, ఆస్పత్రి బిల్లు రూపంలో ఇంకో షాక్. హోటళ్లలో వాడుతున్న నాసిరకం ఆహార పదార్థాల ముడిసరుకులు, అపరిశుభ్ర వాతావరణం, సరైన నీళ్ల వాడక పోవడం, ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన పదార్థాలు వండటం వంటి కారణాలతో ఫుడ్ పాయిజనింగ్ కేసులు తీవ్రమవుతున్నాయి. గడిచిన ఏడాదిలో 150 మంది పైగా ఫుడ్ పాయిజనింగ్‌కు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నట్టు తెలిసింది.

నూనెలు అత్యంత ప్రమాదకరం..

జిల్లాలో పెద్ద హోటళ్లు 100 వరకూ ఉన్నాయి. చిన్న చిన్నవి మరో 200 వరకూ ఉంటాయి. వీధుల్లో అమ్ముతున్న ఆహార బండ్లకు లెక్కేలేదు. ఇక్కడ వాడే నూనెలు, కూరల్లో వేసే రంగులు అత్యంత ప్రమాదకరంగా ఉన్నట్టు తాజాగా అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ప్రధానంగా మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు వంటి పదార్థాలు నాలుగైదు రోజులైనా నిల్వ ఉంచి వినియోగదారులకు పెడుతున్నారు. దీంతో వినియోగదారుడు తీవ్రంగా నష్టపోతున్నాడు. చిన్న చిన్న బడ్డీ కొట్లు అటుంచితే ఓ మోస్తరు మెస్‌లు, రెస్టారెంట్‌లకు కూడా లైసెన్సులు లేని పరిస్థితి.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- మాంసాహారం గానీ, కూరగాయలు గానీ ఎక్కువ సేపు ఉడికించి తినాలి.
- వీలైనంత వరకూ నిల్వ ఉంచకుండా ఏరోజు ఆహారం ఆరోజే తినాలి.
- ఒకసారి వేడిచేసిన నూనెలను మళ్లీ మళ్లీ వాడకుండా నియంత్రించాలి.
- ప్రధానంగా మాంసాహారం అప్పటికప్పుడు తినాలి.
- పురుగు మందుల వాడకం ఎక్కువైన నేపథ్యంలో ఆకుకూరలు, కూరగాయలను వేడినీటిలో కాసింత ఉప్పువేసి అరగంట సేపు నానపెట్టాక వండాలి.
- వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించగానే ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) పౌడర్ నీళ్లలో కలిపి తాగాలి.
- కాచి చల్లార్చిన నీళ్లు ఎక్కువ మోతాదులో తీసుకోవడం..కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలి.

జిల్లాలో పెద్ద హోటళ్లు	100 వరకు
చిన్న హోటళ్లు	200 పైనే
వీధుల్లో ఉండే ఆహార బండ్లు	1000కి పైనే
సేకరించిన నమూనాలు	126
ప్రమాదకరం అని తేలింది	11

ఫుడ్‌పాయిజనింగ్‌కు ప్రధాన కారణం

- ఆహార పదార్థాలను సరిగా శుభ్రం చేయకుండా వినియోగించడం
- సరైన మోతాదులో ఉడికించకుండా తయారు చేయడం
- మాంసాహారాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం
- నూనెలు మళ్లీ మళ్లీ వినియోగించడం
- ఆకర్షణ కోసం రకరకాల రంగులు వేయడం
- బాగా చల్లారి పోయిన పదార్థాలను వడ్డించడం
- ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన చీజ్, బటర్‌లను వాడటం
- బ్యాక్టీరియా ఫామ్ అయిన క్రీమ్స్, పేస్ట్‌లను ఉపయోగించడం



గుంతకల్లులోని ఓ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఆహార భద్రతా అధికారి తస్లీమ్ (ఫైల్)

బయటి ఆహారాన్ని తగ్గించాలి



బయట తయారు చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు హోటళ్లు, రెస్టారెంట్ల ఆహారాన్ని తగ్గించడమే మేలు. అతిగా వినియోగించిన నూనెతో చేసే వంటకాలు తీసుకోవడం వల్ల శరీరంలో కేన్సర్ కారకాలు వృద్ధి చెందే అవకాశం లేకపోలేదు. రోడ్లపై దొరికే ఆహార పదార్థాలతో అజీర్తి, ఇతర గ్యాస్ట్రిక్ సమస్యలు తలెత్తుతాయి.
– డాక్టర్ రామస్వామి నాయక్, ప్రొఫెసర్, జీజీహెచ్

ఇంటి ఆహారమే మంచిది



బయటి ఆహారం అతిగా తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. సాధ్యమైనంత వరకు హోటళ్లలో దొరికే ఆహారాన్ని తిరస్కరించాలి. ఎప్పుడైనా వేరే ఊర్లకు వెళ్లినా తప్పని పరిస్థితుల్లోనే తీసుకోవాలి. నా వరకు ఇంటి ఆహారాన్నే తీసుకుంటా.
– అస్లాం, ఉద్యోగి, అనంతపురం

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు



అపరిశుభ్రంగా ఉండే హోటళ్లపై కేసులు నమోదు చేస్తున్నాం. ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన ఆహారం, పారిశుధ్యం సరిగా లేకపోవడంపైనే దృష్టి సారించాం. ముఖ్యంగా చికెన్, మటన్ వంటి వాటిపై ప్రమాదకర రంగులు వేయొద్దని సూచిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భారీగా జరిమానాలు వేస్తాం.
– చక్రవర్తి, ఫుడ్‌సేఫ్టీ అధికారి

అంబేడ్కర్‌నే అవమానిస్తారా?



గుత్తిలో మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



రాప్తాడులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

- ఉన్మాదులను కఠినంగా శిక్షించాల్సిందే
- ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్
- గుత్తిలో మోకాళ్లపై కూర్చుని నిరసన

గుత్తి: విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి సంబంధించిన శిలా ఫలకాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలో శనివారం రాస్తారోకో చేపట్టి, మోకాళ్లపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష, గౌరవాధ్యక్షులు అంజన్ ప్రసాద్, రామదాసు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా పేరు గాంచిన అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగలను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడిని యావత్తు దేశ ప్రజలందరూ ఖండిస్తున్నారన్నారు. దుండగులను అరెస్టు చేయకపోతే దేశ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ ఆందోళనలు చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రామకృష్ణ, హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, కోటి, కాశీరావు, రాము, హరి, లాలెప్ప, ఓబులేసు, రాజేష్, రామాంజి, నాగార్జున, వేణు, వెంకటేష్, కన్నప్ప, ఉమేశ్వర కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం అమానుషం


రాప్తాడు: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం అమానుషమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నల రవికుమార్ అన్నారు. రాప్తాడులో జూటూరు శేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకంపై వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరును ధ్వంసం చేయడం తీవ్రమైన నేరంగా భావించాలన్నారు. దుండగులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ప్రోద్బలంతోనే శిలాఫలకంపై దాడి జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బండి పవన్ కుమార్, సాకే చంద్ర, గవ్వల పరంధామ, వెన్నపూస లోకేశ్వర్‌రెడ్డి, చిన్నక్రిష్ణారెడ్డి, బుడగ పెద్ద లింగమయ్య, నారాయణరెడ్డి పాల్గొన్నారు.


పండుగలకు ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: స్వాతంత్య్ర దినోత్సవం, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాయలసీమ జిల్లాల మీదుగా ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన మేరకు.. ఈ నెల 14, 16 తేదీల్లో కాచిగూడ–తిరుపతి మధ్య (07653) ఎక్స్‌ప్రెస్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ జంక్షన్ నుంచి రాత్రి 10.30 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.25 గంటలకు తిరుపతి జంక్షన్ చేరుతుంది. ఈ నెల 15, 17వ తేదీల్లో రాత్రి 7.50 గంటలకు తిరుపతి జంక్షన్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30 గంటలకు కాచిగూడ జంక్షన్‌కు చేరుతుంది. షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల్, కర్నూలు, డోన్, గుత్తి, యర్రగుంట్ల, కడప, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

- ఈ నెల 14, 15వ తేదీల్లో తిరుపతి–నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తాయి. 14న తిరుపతి రైల్వేస్టేషన్ (07417) నుంచి ఉదయం 8.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10 గంటలకు రైలు నాగర్‌సోల్ చేరుతుంది. 15వ తేదీ నాగర్‌సోల్ రైల్వేస్టేషన్ (07418) నుంచి రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు తిరుపతి జంక్షన్‌కు చేరుతుంది. రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, యర్రగుంట్ల, ముద్దనూరు, తాడిప్రతి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుంది.
- 17,18వ తేదీల్లో తిరుపతి–సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఏర్పాటు చేశారు. 17వ తేదీ తిరుపతి జంక్షన్ (07489) నుంచి సాయంత్రం 5.15 గంటలకు రైలు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.25 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్ చేరుతుంది. 18న సికింద్రాబాద్ జంక్షన్ (07490) సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.15 కు తిరుపతి జంక్షన్ చేరుతుంది. రేణిగుంట, రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్గిరి, చిత్తపూర్, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి.
- 19న తిరుపతి–నాందేడ్ మధ్య వన్‌సైడ్ స్పెషల్ ట్రిన్ నడుస్తుంది. 19 సోమవారం సాయంత్రం 5.15 గంటలకు తిరుపతి జంక్షన్ (07417) నుంచి బయలుదేరే రైలు రేణిగుంట,రాజంపేట, కడప, యర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్గిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాద్, మేడ్చల్, కామారెడ్డి, నిజామబాద్, ధర్మాబాద్ మీదుగా నాందేడ్‌కు మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చేరుతుంది.

నెట్టికంటుడి క్షేత్రం.. భక్తజన సంద్రం





వజ్రకవచ అలంకరణలో నెట్టికంటి ఆంజనేయస్వామి, ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఆలయంలో బారులు తీరిన భక్తులు

- మార్మోగిన ఆంజనేయస్వామి నామస్మరణ
- కనులపండువగా ప్రాకారోత్సవం

గుంతకల్లు రూరల్: కోరిన కోర్కెలు తీర్చే పెన్నిధిగా, భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం శ్రావణమాసం మొదటి శనివారం కిటకిటలాడింది. ఉత్సవాల్లో భాగంగా సీతారామలక్ష్మణులతో కలిసి ఆంజనేయస్వామి వారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పురవీధులు ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగాయి. శనివారం వేకువజామునే అర్చకులు స్వామి మూల విరాట్‌కు అభిషేకాలు చేశారు. స్వామి వారిని స్వర్ణ కవచం, ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేష వాహనంపై కొలువుదీర్చి కనులపండువగా ప్రాకారోత్సవం చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్త సుగుణమ్మ పాల్గొన్నారు.

పోలీస్ కంట్రోల్ రూంను బలోపేతం చేయాలి



పోలీస్ కంట్రోల్ రూంలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనంతపురం: జిల్లా పోలీస్ కంట్రోల్ రూంను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని పోలీస్ కంట్రోల్ రూం, డయల్ 100, సైబర్ క్రైం తదితర విభాగాలను ఎస్పీ శనివారం తనిఖీ చేశారు. అనంతపురం నగరంతో పాటు మున్సిపాలిటీల్లోని శివారు ప్రాంతాలపై సైతం నిఘా ఉంచాలన్నారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం జిల్లాలో ఏ విధంగా నడుస్తుందో, ఎన్ని కెమెరాలు పనిచేస్తున్నాయో తెలుసుకోవడంతో పాటు మరింత మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ విజయ భాస్కర్ రెడ్డి, ఎస్బీ సీఐ ఇందిర, పోలీస్ కంట్రోల్ రూం సీఐ దేవానంద్, సైబర్ సెల్ సీఐ షేక్ జాకీర్ ఉన్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడి సన్నిధిలో జైళ్ల శాఖ డీఐజీ, ఎస్పీ



స్వామివారి చిత్రపటాన్ని ఎస్పీ మురళీకృష్ణకు అందిస్తున్న అధికారులు

గుంతకల్లు రూరల్: జైళ్ల శాఖ రాయలసీమ డీఐజీ వరప్రసాద్, అనంతపురం ఎస్పీ మురళీకృష్ణ శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారి దర్శనార్థం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు డీఐజీ, ఎస్పీకి స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, రూరల్ సీఐ మహేశ్వరరెడ్డి ఉన్నారు.

ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు

అనంతపురం సిటీ: ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో పొగలు రావడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో రైలును మార్గమధ్యంలోని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు రైల్వేస్టేషన్‌లో అరగంట పాటు ఆపేశారు. అనంతపురం రైల్వే అధికారులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన సమాచారం ప్రకారం... శుక్రవారం రాత్రి ధర్మవరం నుంచి అనంతపురం మీదుగా మచిలీపట్నం బయలుదేరిన రైలు మార్గ మధ్యంలోని ప్రొద్దుటూరుకు చేరుకునే సరికి బాగా పొద్దుపోయింది. స్టేషన్‌లో ఆగేందుకు పైలెట్ బ్రేక్ వేసే సమయంలో ఏసీ బోగీ వద్ద ఒక్కసారిగా పొగ వచ్చింది. స్టేషన్ ఆవరణమంతా ఆవరించింది. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. వర్షం పడడం, బ్రేకులను పదే పదే వేయడంతో ఏసీ బోగీ చక్రాల కింద పొగ వచ్చినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. దీనివల్ల ఎటువంటి ప్రమాదమూ లేదని ప్రకటించారు. అరగంట ఆలస్యంగా రైలు బయలుదేరి వెళ్లింది.

రైతు ఆత్మహత్య



మృతుడు ఆదినారాయణ

పామిడి: అప్పుల బాధ తాళలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక తలవాలకట్టవీధికి చెందిన రైతు అంగజాల ఆదినారాయణ(39) తనకున్న రెండెకరాలతోపాటు మరో 4 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసేవాడు. పంటల దిగుబడి లేక పంటల కోసం చేసిన అప్పులు రూ.10 లక్షల దాకా పెరిగిపోయాయి. దీంతో వాటిని ఎలా తీర్చాల తెలియక మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య వేదావతితో కుమార్తె, కుమారుడు ఉన్నారు.

భువన్.. ప్రతిభ అదిరెన్!

అతడు బ్యాట్ పడితే పరుగులే పరుగులు. బౌలర్‌కు చుక్కలు చూపిస్తాడు. అండర్-12తో ప్రారంభమైన అతడి క్రీడాజీవితం రోజురోజుకూ మెరుగవుతూనే ఉంది. టోర్నీ ఏదైనా తన ప్రతిభతో అందరి చూపు అతడిపై పడేలా చేస్తాడు. ఇప్పటి వరకూ 13 సెంచరీలు, 35 అర్ధసెంచరీలు చేశాడంటే అతడి సత్తా ఏంటో తెలిసిపోతుంది. అతడే గుత్తి పట్టణానికి చెందిన భువనేశ్వర్.

- బ్యాట్ పట్టితే పరుగులే పరుగులు
- పదేళ్లుగా సత్తా చాటుతున్న వైనం
- అండర్-12, 14, 15, 16, 19 క్రికెట్ టోర్నీల్లో ప్రతిభ



క్రికెట్ కప్‌తో భువనేశ్వర్



బ్యాటింగ్ చేస్తున్న భువనేశ్వర్



న్యూజిలాండ్ ప్లేయర్ రచిన్ రవీంద్రతో భువనేశ్వర్

గుత్తి: పట్టణానికి చెందిన భువనేశ్వర్ అలియాస్ భువన్ క్రికెట్‌లో చిచ్చరపిడుగులా చెలరేగిపోతున్నాడు. సుమారు పదేళ్లుగా ఆడిన ప్రతి టోర్నీలో ప్రతిభను చాటుతూ ముందుకు దూసుకెళుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని చెర్లోపల్లి కాలనీ నివాసముండే శ్రీనివాస బాబు, భారతి దంపతులకు భువనేశ్వర్, సౌమ్య శ్రీ సంతానం. తండ్రి శ్రీనివాస బాబు ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహిస్తున్నాడు. తల్లి భారతి గృహిణి. భువనేశ్వర్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. ఏడీసీఏ(అనంతపురం డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్) సెక్రెటరీ మధు ఆచారి భువనేశ్వర్ ప్రతిభను గుర్తించాడు. దీంతో అతడి తల్లిదండ్రులతో మాట్లాడి క్రికెట్‌లో తర్ఫీదు ఇప్పించాడు. కోచ్ లు ఆర్. కుమార్(జోషి), మగ్గీ మార్గదర్శకత్వంలో భువనేశ్వర్‌లో రోజురోజుకు తన నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుని కెరీర్‌లో దూసుకుపోతున్నాడు.

ఓపెనర్‌గా.. వికెట్ కీపర్‌గా..

అండర్-12, అండర్-14, అండర్-15, అండర్-16, అండర్-19 క్రికెట్ టోర్నీలకు ఎంపికై తన సత్తా చాటాడు. వివిధ ప్రాంతాల్లో జరిగిన క్రికెట్ టోర్నీల్లో ఇప్పటి వరకు 13 సంచరీలు, 35 ఆఫ్ సెంచరీలు చేశాడు. ఏపీఎల్‌లో డబుల్ సెంచరీ(203 నాటౌట్) అతడి కెరీర్‌లో ఓ మైలురాయి. అండర్-12 మొదలుకుని అండర్-19 వరకు అన్ని టోర్నీల్లో సత్తా చూపాడు. ఓపెనర్‌గా , వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. అంతర్జాతీయ స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో బ్యాట్ ఝులిపిస్తున్నాడు. ఆర్డీటీ తరఫున అనేక టోర్నీల్లో ప్రాతినిధ్యం వహించి సత్తా చాటాడు. అండర్-12లో ఒక సెంచరీ, అండర్-14లో మూడు సెంచరీలు, అండర్-15లో రెండు సెంచరీలు, అండర్-16లో నాలుగు సెంచరీలు, ఏపీఎల్‌లో ఒక సెంచరీ, జిల్లా స్థాయి, జోనల్ స్థాయిలో ఒక సెంచరీ సాధించాడు.

దేశం తరఫున ఆడాలన్నదే లక్ష్యం

జిల్లాస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎంపికయ్యా. ఎప్పటికైనా భారత తరఫున ఆడాలన్నదే నా లక్ష్యం. ఆ దిశగా ముందుకెళతాను. కోచ్‌లు నాకు అన్ని విధాలా సహకరిస్తున్నారు. ముఖ్యంగా ఏడీసీఏ సెక్రటరీ మధు ఆచారి, కోచ్‌లు ఆర్.కుమార్(జోషి), మగ్గీ,నరేష్, యుగంధర్‌రెడ్డి క్రికెట్‌లో శిక్షణ ఇవ్వడంతోపాటు విలువైన సలహాలిస్తున్నారు.

–భువనేశ్వర్, గుత్తి

మంచి భవిష్యత్ ఉంది



భువనేశ్వర్‌కు క్రికెట్ అంటే ప్రాణం. గత పదేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ పొందుతూ బాగా రాణిస్తున్నాడు. ఓపెనర్‌గా, వికెట్ కీపర్‌గా రాణిస్తున్నాడు. అతడికి మంచి భవిష్యత్ ఉంది.

–మధు ఆచారి, ఏడీసీఏ సెక్రటరీ, అనంతపురం

అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతాడు



క్రికెట్ అంటే భువనేశ్వర్‌కు ఎనలేని ఆసక్తి. ఇప్పటికే అన్ని విభాగాల్లో రాణిస్తున్నాడు. అండర్-12 నుంచి అండర్ -19 వరకు , అదే విధంగా జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నాడు. అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశముంది.

– ఆర్.కుమార్(జోషి) ,క్రికెట్ కోచ్, గుత్తి ఆర్ఎస్

బాగా రాణిస్తున్నాడు



భువనేశ్వర్ చిన్నప్పటి నుంచి క్రికెట్‌లో రాణిస్తున్నాడు. ఏ రకం టోర్నీ అయినా బ్యాట్ ఝులిపించాడంటే సెంచరీ లేదా అర్ధ సెంచరీ కొట్టడం ఖాయం. భువన్ క్రీజ్‌లో ఉన్నాడంటే ఆ జట్టు ఇక గెలిచినట్లే. భువన్‌కు క్రికెట్‌లో మంచి భవిష్యత్ ఉంది.

– మగ్గీ (మహేష్), క్రికెట్ కోచ్, గుత్తి ఆర్ఎస్

పురపాలక ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి



సమావేశమైన మునిసిపల్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ నేతలు

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో వివిధ నగర పాలక సంస్థ, పురపాలక సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను ఆయా పురపాలకాల్లో మేనేజర్, ఆర్ఓ, తదితర పోస్టుల పదోన్నతులతో భర్తీ చేయాలని ఏపీ మునిసిపల్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కృష్ణమోహన్ రావు డిమాండ్ చేశారు. శనివారం నగర శివారు జేఎన్‌టీయూ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ రీజియన్ మునిసిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ కొత్తగా మునిసిపాలిటీలుగా ఆవిర్భవించిన పురపాలకాల్లో ఉద్యోగుల నమూనా(స్టాఫ్ పాటర్న్) సిద్ధం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఉద్యోగులకు పదోన్నతులు లభించడమే కాకుండా ఆయా మునిసిపాలిటీల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సేవలందే అవకాశం ఉంటుందన్నారు. కొన్ని మునిసిపాలిటీల్లో అరకొర సిబ్బందితో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారన్నారు. మునిసిపల్ ఉద్యోగులకు జీపీఎఫ్ ఖాతాలు అమలు చేయాలన్నారు. అనంతరం సమావేశంలో పేర్కొన్న వివిధ సమస్యలను ఆయన అజెండాలో చేర్చారు. సమావేశంలో ఏపీ మునిసిపల్ మినిస్టీరియల్ స్టాఫ్ నాయకులు యు ఆంజనేయులు, నరసింహులు, గిరిధర్, మల్లికార్జున, లక్ష్మినారాయణ, చాంద్‌బాషా, అబీదాబేగం, వేదవతి, నాయుడు బాబు, శ్రీనివాస్, వివిధ మునిసిపాలిటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు 'అనంత' మెడికోలు



మెడికోలను అభినందిస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు



విద్యార్థిని స్వప్నకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న ప్రిన్సిపాల్ శంకరయ్య

అనంతపురం మెడికల్: ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల మెడికోలు ఏజీ పరిణీత సాయి, కే హర్షశ్రీవిష్ణు(సెకండియర్) ఎంపికైనట్లు ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. శనివారం విద్యార్థులను ఆయన అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు, మేరీ మట్టి మేరా దేశ్, అమృత వాటిక, రక్తదానం, మొక్కలు నాటే కార్యక్రమాలు, అవయవదానం, కూచిపుడి, భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాల్లో ప్రావీణ్యాన్ని గుర్తించి ఎంపిక చేశారన్నారు.

కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని..

అనంతపురం ఎడ్యుకేషన్: ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినికి పిలుపు వచ్చింది. డిగ్రీ బీకామ్ ఫైనలియర్ చదువుతున్న ఎం. స్వప్న ఎన్ఎస్ఎస్ తరఫున పాల్గొననున్నారు. కేంద్ర యువజన సర్వీసుల క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి ఆహ్వానం అందింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శంకరయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ బి. రామకృష్ణ, ఫాతి మున్నీసా బేగం తదితరులు విద్యార్థిని అభినందించారు.

గాలిమరల ఇంజినీర్ మృతి



వీరేష్(ఫైల్)

బెళుగుప్ప: లిఫ్ట్ తెగి కిందపడడంతో గాలి మరల కంపెనీలో పని చేస్తున్న ఓ ఇంజినీర్ మృతి చెందాడు. వివరాలు... బళ్లారి జిల్లా సిరిగుప్ప తాలూక సిరిగేరి గ్రామానికి చెందిన తల్వార్ వాల్మీకి వీరేష్(33) సుజలాన్ విండ్ పవర్ కంపెనీలో మెకానికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. భార్య కనకమ్మ ఒక కుమారుడు ఒక కుమార్తెతో కలసి బెళుగుప్ప మండల కేంద్రంలోనే నివాసముంటున్నాడు. నక్కలపల్లి వద్దనున్న గాలిమర లోపలి భాగంలో లిఫ్ట్ పని చేయకపోవడంతో శుక్రవారం మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. ఈక్రమంలో ఉన్న ఫలంగా లిఫ్ట్ మొత్తం కూలి కిందకుపడింది. ప్రమాదంలో ఒత్తడికి గురైన అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. తోటి ఉద్యోగులు వెంటనే అతడిని హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ పేర్కొన్నారు.

సూర్యదేవుడి సన్నిధిలో కలెక్టర్



బూదగవిలో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు, అర్చకులు

ఉరవకొండ: రాష్ట్రంలోనే రెండో సూర్యదేవాలయంగా ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ మండలంలోని బూదగవి సూర్యదేవాలయాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. అర్చకులు కలెక్టర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం సూర్యభగవానుడి మూలవిరాట్ వద్ద కలెక్టర్ పూజలు జరిపించారు. కలెక్టర్ గ్రామపెద్దలు, ఆలయ అర్చకుల ద్వారా ఆలయ ఆలయ విశిష్ఠతను తెలుసుకున్నారు. కలెక్టర్‌కు అర్చకులు, గ్రామపెద్దలు సత్కరించారు.

లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఎస్పీ

ప్రసిద్ధిగాంచిన పెన్నహోబిళం లక్ష్మీనృసింహస్వామిని ఎస్పీ మురళీకృష్ణ శనివారం దర్శించుకున్నారు. అర్చకులు బాలాజీస్వామి ఎస్పీకి ఆలయ మర్యాదలతో సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ఎస్పీ ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామి చిత్రపటాన్ని, స్వామి వారి తీర్థప్రసాదాలను ఎస్పీకి అందించారు. అర్బన్ సీఐ సురేష్‌బాబు ఉన్నారు.

కాపరిపై ఎలుగుబంటి దాడి

శెట్టూరు: లక్ష్మంపల్లిలో శనివారం ఓ మేకల కాపరిపై ఎలుగుబంటి దాడి చేసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మేకల కాపరి సోమనాథ ఉదయం మేకలను మేపు కోసం ఊరి బయటకు తీసుకెళ్లాడు. పొదల చాటున ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా సోమనాథపై దాడికి యత్నించింది. ఈక్రమంలో వెనుకవైపు చిన్నగాట్లు పడగా చొక్కా చినిగిపోయింది. అప్రమత్తమైన అతడు అక్కడి నుంచి పారిపోయాడు.

నేత కార్మికుడి కుమారుడికి ఆర్బీఐలో ఉద్యోగం



జయకృష్ణ

యాడికి: మండల కేంద్రానికి చెందిన నేత కార్మికుడి కుమారుడు రిజర్వ్ బ్యాంకు ఉద్యోగం సాధించాడు. ప్రభుత్వం పాఠశాలలో చదివి ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులతో పాటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు...మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి దేవాలయం వెనుక భాగాన ఉన్న చేనేత కార్మికుడు పూజారి తిరుపతయ్య, లక్ష్మి దంపతుల రెండో కుమారుడు జయకృష్ణ 1 నుంచి పదో తరగతి వరకు యాడికి ఉన్నత పాఠశాలలో చదివాడు. తిరుపతిలో డిగ్రీ చదివిన జయకృష్ణ అనంతరం బ్యాంకు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొంది 2022లో మూడు బ్యాంకుల్లో క్లర్క్‌గా ఉద్యోగాలు సాధించాడు. తాజాగా ఆర్బీఐలో అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు. తాను ఆర్డీటీ సహకారంతో ఉన్నత చదువులు చదివానని, తన మొదటి నెల వేతనం ఆర్డీటీకి అందజేస్తానని జయకృష్ణ పేర్కొన్నారు.

మేకల మందపై చిరుత దాడి

కంబదూరు: మండల కేంద్రం సమీపంలో శనివారం ఓ చిరుత మేకల మందపై దాడి చేసింది. ఘటనలో ఓ మేక మృతి చెందింది. బాధితుడి వివరాల మేరకు... మండల కేంద్రానికి చెందిన మిరియాలు వెంకటేశులు ఉదయం మల్లేశ్వరస్వామి ఆలయ సమీపంలోకి మేకలను మేపు కోసం తీసుకెళ్లాడు. సమీపంలోని కొండలో నుంచి వచ్చిన ఓ చిరుత మేకల మందపై దాడి చేసింది. చుట్టు పక్కల ఉన్న కాపరులు గమనించి కేకలు వేయగా చిరుత మేకలను వదిలేసి వెళ్లిపోయింది. ఘటనలో ఓ మేక మృతి చెందగా రెండు గాయపడ్డాయి. రూ.20 వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

'వక్ఫ్ సవరణ బిల్లును టీడీపీ, జనసేన వ్యతిరేకించాలి'



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

ఉరవకొండ: రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే వక్ఫ్ సవరణ బిల్లును ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన వ్యతిరేకించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి కిరణ్ రిజుజు వక్ఫ్ చట్టం 1995 సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టారన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు మత స్వేచ్ఛకు విరుద్ధమని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో ఖండించాయన్నారు. మైనార్టీలకు తమ ఆస్తులను నిర్వహించుకొనేందుకు రాజ్యాంగంలోని 30వ అధికరణ వీలు కల్పిస్తుందన్నారు. ఈబిల్లు 14, 15, 35 అధికరణలను కూడా ఉల్లంఘిస్తుందన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు వక్ఫ్ భూములు కాపాడే పద్ధతిలో వ్యవహరించాలని కోరారు. ఉరవకొండ మండలం ఆమిద్యాల వద్ద డ్రిప్ ఇరిగేషన్ సామగ్రి తుప్పు పట్టిపోతుందని, ప్రభుత్వం దీన్ని రైతులకు అందించాలన్నారు. సీపీఐ నేతలు కేశవరెడ్డి, మల్లికార్జున, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పార్వతీప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం పరిశీలన

అనంతపురం రూరల్: అనంతపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఐఎస్ఓ ప్రతినిధులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై ఆర్డీఓ వసంత బాబు, ఇతర అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఓ ప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

38 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్

అనంతపురం సిటీ:సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లి, ప్రస్తుతం సొంత జిల్లాకు తిరిగొచ్చిన 38 మంది ఎంపీడీఓలకు పోస్టింగ్ ఇచ్చారు. వీరిలో అనంతపురం జిల్లాకు 13 మంది, శ్రీసత్యసాయి జిల్లాకు 25 మందిని కేటాయించారు. వీరికి మండలాలు కేటాయిస్తూ శనివారం రాత్రి జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ ప్రభాకర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా సోమవారం విధుల్లోకి చేరిపోవాలని ఆదేశించారు. అనంతపురం జిల్లాకు సంబంధించి కె.తేజోత్స్న బుక్కరాయసముద్రం, ఎస్.షకీలాబేగం బొమ్మనహాళ్, బి.విజయభాస్కర్ గార్లదిన్నె, ఎస్.నరసింహమూర్తి గుమ్మఘట్ట, పీడీ శ్రీనివాసులు కణేకల్లు, జి.లక్ష్మీనరసింహ కుందుర్పి, డి.ప్రభాకర్ పామిడి, బి.రామకృష్ణ పెద్దపప్పూరు, పి.కుళ్లాయిస్వామి పెద్దవడగూరు, టి.యోగానందరెడ్డి పుట్లూరు, బి.నిర్మలకుమారి శింగనమల, ఎ.వెంకటరంగారావు తాడిపత్రి, పి.దివాకర్ నార్పల, జె.సాల్మన్ రాప్తాడు, ఎ.వి.శ్రీనివాసులు విడపనకల్లు, టి.లక్ష్మీనారాయణ యాడికి, జీఎస్ రామచంద్ర బెళుగుప్ప మండలానికి నియమితులయ్యారు.

- శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి బి.శకుంతల నల్లచెరువు, ఎం.కొండన్న నల్లమాడ, బీవీ రవి ప్రసాద్ అగళి, జి.మునెప్ప అమడగూరు, ఎస్.సాయి మనోహర్ బత్తలపల్లి, ఎస్.గంగావతి చెన్నేకొత్తపల్లి, కేఎన్ నరేశ్ కృష్ణ చిలమత్తూరు, డి.రామారావు గుడిబండ, పి.నరేంద్రకుమార్ హిందూపురం, టి.అలివేలమ్మ కనగానపల్లి, ఎస్.బారాన్ సాహెబ్ కొత్తచెరువు, ఎం.నరసింహనాయుడు లేపాక్షి, సీఎల్ సోనీబాయి మడకశిర, కె.వి.కవిరాజు ముదిగుబ్బ, ఎస్.సరస్వతి పరిగి, ఎన్.శివశంకరప్ప పెనుకొండ, డి.రాబర్ట్ విల్సన్ రొద్దం, కె.ఆజాద్ రొళ్ల, బి.విజయలక్ష్మి తాడిమర్రి, బి.కిరణ్‌మోహన్‌రావు తలుపుల, ఎన్.రఘునాథగుప్త గోరంట్ల మండలానికి నియమితులయ్యారు.

మూడు టిప్పర్లు, జేసీబీల స్వాధీనం

తాడిపత్రి రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తాడిపత్రి మండలంలో పట్టణ సమీపంలో శనివారం సాయంత్రం పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు జరిపారు. ఈసందర్భంగా కొత్త బ్రిడ్జి వద్దనున్న గంగమ్మ ఆలయం వెనుక భాగంలో డంప్ చేసిన ఇసుక తరలిస్తున్న టీడీపీకి మద్దతుదారులకు చెందిన మూడు టిప్పర్లు, జేసీబీలను పట్టుకుని రూరల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

'సమగ్ర'లో 8 పోస్టులు...110 దరఖాస్తులు

- అనుయాయుల కోసం 'అధికార' ఒత్తిళ్లు షురూ

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టులకు 110 దరఖాస్తులు వచ్చాయి. అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ), గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ), ఏఎంఓ (జనరల్), ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్ఓ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 9తో దరఖాస్తు గడువు ముగిసింది. వచ్చిన 110 దరఖాస్తుల్లో ఒకే టీచరు 4-5 పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇలా వచ్చిన దరఖాస్తులు చాలానే ఉన్నాయి. పీజీ అర్హత లేకపోయినా, ఇతర జిల్లాల్లో పని చేస్తున్న వారు, మోడల్ స్కూళ్లలో పని చేస్తున్న వారూ దరఖాస్తు చేసుకున్నారు. ఇలాంటివారందరూ అనర్హులే. ఈనెల 11, 12 తేదీల్లో ప్రధానోపాధ్యాయుల ద్వారా స్క్రూటినీ చేయిస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను ప్రకటించనున్నారు.

తమవారికి అవకాశం ఇవ్వండి

తమ తనయాయుల కోసం అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సులు చేస్తున్నారు. స్వయంగా అధికారులకు ఫోన్లు చేస్తూ, మెసేజ్‌లు పెడుతూ ఫలానా వారికి ఖచ్చితంగా అవకాశం ఇవ్వాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. విద్యాశాఖలో ఓ అధికారి సైతం తాను చూసుకుంటానని అభయం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. నిబంధనల పేరుతో ఉన్నవాళ్లను తప్పించేందుకు తీవ్రంగా శ్రమించిన అధికారి అదే నిబంధనలతో అనర్హులకు ఎలా పెద్దపీట వేస్తారో వేచిచూడాలి.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం: హ్యాండ్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లను శనివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. ఈ నెల 17, 18 తేదీల్లో కదిరి పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్లు పాల్గొననున్నాయి.

బాలుర జట్టు : టి.లింగ, డి.ఈశ్వర్, సి.అభిషేక్, జగదీష్, ఎం.చక్రధర్ నాయక్, బి.బాలు, కె.తరుణ్, ఎం.పవన్‌కుమార్, నరసింహమూర్తి, కె.సాయి చరణ్, కేపీ దినేష్, ఎల్.ప్రవీణ్ చంద్ర, ఆర్.సాయి కుమార్, ఎస్.అహ్మద్ తౌఫిక్, పి.అర్జున్, పి.పవన్ ప్రణీత్.

బాలికల జట్టు : బి.గీతాంజలి, జి.వరలక్ష్మి, టి.శారద, టి.సుస్మిత, వీఎల్ స్వాతి, కె.గురువర్షిణి, సి.స్వాతి, సి.మాధవీ లత, శ్రీ హర్షిత, కె.రక్షిత, డి.కీర్తన, ఎండీ జోహా ఫాతిమా, టి.సాయి దీక్షిత, భారతి, సుమియా ఫిర్దోస్.

క్లుప్తంగా

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం డివిజన్ ఏడీఏ ఎం.రవి హెచ్చరించారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంఆర్‌పీకి మించి విక్రయిస్తూ పట్టుబడితే చట్టపరమైన చర్యలతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. 45 కిలోల యూరియా బస్తా ధర రూ.266 అని, అంతకు మించి అమ్మితే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవసరమైతే లైసెన్సులు కూడా రద్దు చేస్తామన్నారు. రైతులు కూడా ఎంఆర్‌పీకి మించి ఇవ్వకూడదన్నారు. ఎక్కడైనా అలా విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

బయోవేస్ట్‌ను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలి

అనంతపురం మెడికల్: ఆస్పత్రుల్లో వెలువడే వ్యర్థాల(బయోవేస్ట్)ను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహణ చేపట్టాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి స్పష్టం చేశారు. శనివారం నగరంలోని యశోద ప్రైవేట్ ఆస్పత్రిని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బయో వేస్ట్‌ను ఎక్కడ పడితే అక్కడ పడేయరాదన్నారు. దీంతో ప్రమాదాలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కులశేఖర్ మృతి తీరని లోటు


కులశేఖర్

అనంతపురం కల్చరల్: తెలుగు రంగస్థలానికి విశేష సేవలందించిన నటుడు, రచయిత కులశేఖర్ మరణం తీరని లోటని లలితకళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ అన్నారు. శనివారం తెల్లవారుజామున కులశేఖర్ అనారోగ్యంతో ప్రాణాలు విడిచారు. ఈ క్రమంలో పద్మజ సంతాపం తెలియజేశారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన పల్లేటి కులశేఖర్ ఎంతోమంది దిగ్గజ నటులకు అవకాశం కల్పించారని గుర్తు చేసుకున్నారు. ఏడు పదుల వయసులో కూడా రంగస్థలమంటే అభిమానించే వారన్నారు. వ్యక్తిగతంగాను 94 నంది అవార్డులందుకున్నారన్నారు. ప్రస్తుతం ఆయన రాసిన 'శకుని' నాటకాన్ని నంది నాటక పోటీల కోసం పరిశీలిస్తున్నామని, ఇంతలోనే దారుణం జరగడం విచారకరమని ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆయన దశాబ్దాల కృషికి లలితకళాపరిషత్తు వారు రాష్ట్రస్థాయి బళ్లారి రాఘవ అవార్డునందించడం గొప్ప సంతృప్తినందించిందన్నారు. ఆయన జ్ఞాపకార్థం పలు కార్యక్రమాలను రూపొందిస్తామని పేర్కొన్నారు. లలితకళాపరిషత్తు అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, సీనియర్ రంగస్థల నటులు సోమిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, కుళ్లాయప్ప, రామగోవిందు, రామాంజనేయులు, ఆనంద్ తదితరులు కులశేఖర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడి హేయం

అనంతపురం టవర్‌క్లాక్: అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పంపై దాడి చేయడం హేయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు నరేష్ కోడవండ్ల, రాష్ట్ర అధ్యక్షులు జే. ఓబుల రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో రూ. 404.35 కోట్లతో 18 ఎకరాల్లో సామాజిక న్యాయ మహా శిల్పం, స్మృతివనం ఏర్పాటు చేశారన్నారు. దీన్ని జీర్ణించుకోలేక, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేరు ఉందని శిలా ఫలకం పగులకొట్టడం సమంజసం కాదన్నారు. ఆయనలాగే ఈ ప్రభుత్వం కూడా దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శిలా ఫలకం పగులగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. లేని పక్షంలో అన్ని కుల, ప్రజా సంఘాలను కలుపుకుని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 18న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జేఏసీ నూతన రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేసి, అందరినీ కలుపుకుని వారి సమస్యలపై పోరాటాలు చేపడతామన్నారు.

వైభవంగా శ్రీవారి పల్లకీసేవ


పెన్నహోబిలంలో శ్రీవారి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి పల్లకీసేవ శనివారం జరిగింది. దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకం, మహామంగళహారతి, కుంకుమార్చన చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో ఉంచి, ఆలయ వీధుల్లో ఊరేగించారు. పెన్నహోబిలంలో పెళ్లిళ్ల సందడి నెలకొనడంతో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

- వైభవంగా ఏడు శనివారాల వ్రతాలు


వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ఆలయంలో జరిగిన సామూహిక వ్రతంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

అనంతపురం కల్చరల్: నగరంలో పలు వేంకటేశ్వర స్వామి ఆలయాలతో పాటు శంకర మఠంలో సామూహిక వ్రతాల సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. శ్రీవారికి ప్రీతికరమైన ఏడు శనివారాల వ్రతం వైభవంగా సాగింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రామ్‌నగర్, హౌసింగుబోర్డు, ఆర్‌ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి, అశోక్‌నగర్‌లోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో నియమనిష్ఠలతో జరిగిన వ్రతంలో వందలాదిగా మహిళలు పాల్గొన్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మహిళలు పవిత్ర కంకణధారులై పసుపు వస్త్రాలతో స్వామివారిని ప్రత్యేకంగా అర్చించుకున్నారు. అంతకు ముందు ఆలయంలో కొలువైన లక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామికి తిరుమంజన సేవ, తోమాల సేవ, అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన కనులపండువగా జరిగాయి. మధ్యాహ్నం తీర్థప్రసాద వినియోగం అనంతరం అన్నదాన కార్యక్రమం ఘనంగా జరిగింది.

- ఆర్‌ఎఫ్‌రోడ్డు ఆలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి తీర్థప్రసాదాలు అందుకున్నారు. తులాభారం ద్వారా మొక్కులు తీర్చుకున్నారు.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ బాధ్యత ప్రభుత్వానిదే

- మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని నగర మేయర్ వసీం సలీం పేర్కొన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్‌బోర్డుల స్వయం ప్రతిపత్తిని కేంద్ర ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకోవాలని కుట్రపూరితమైన ధోరణితో ముందుకెళ్తోందన్నారు. ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పిన టీడీపీ.. తాజాగా బిల్లు విషయంలో బీజేపీకి మద్దతు తెలిపి ముస్లిం మైనార్టీలను మోసం చేసిందని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లింలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు దక్కేలా చర్యలు తీసుకుంటే, కూటమి ప్రభుత్వం ముస్లింలకు చెందిన ఆస్తులను కాజేయాలని చూస్తోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంపై టీడీపీ ఎంపీలు ఒత్తిడి తీసుకువచ్చి మైనార్టీలకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ముస్లిం మైనార్టీల ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఉపేంద్ర అనే బాలుడికి పాముకాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఉపేంద్ర అనే బాలుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసింది. కుటుంబీకులు వెంటనే ఉపేంద్రను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాలుడిని వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కత్తితో బెదిరించి పర్సు, సెల్‌ఫోన్ చోరీ

తాడిపత్రి రూరల్: స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం తెల్లవారుజామున ప్రయాణికుడిని కత్తితో బెదిరించి పర్సు, సెల్‌ఫోన్‌ను అపహరించిన దొంగపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందింది. మండలంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి స్వస్థలం నుంచి రాయలసీమ రైలులో తెల్లవారుజామున తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో దిగాడు. ప్లాట్ ఫారం చివర దిగి ఒంటరిగా బయటకు వస్తుండడంతో ఓ దొంగ కత్తిని చూపించి పర్సు, సెల్‌ఫోన్ లాక్కున్నాడు. ఆ ఉద్యోగి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారమిచ్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు.

హోటల్లో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోరంపల్లి పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ఓ హోటల్‌లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రిస్వామి హోటల్ నిర్వహిస్తుండేవాడు. రెండు రోజులుగా హోటల్ తెరవలేదు. శనివారం వచ్చి చూడగా హోటల్ తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో అందులోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. హోటల్లో ఉన్న ఫ్రిజ్, కిరాణా సరుకులు, సిలిండర్ ఎత్తుకెళ్లారని, రూ.35వేలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు.

భార్యపై భర్త దాడి

తాడిపత్రి అర్బన్: మద్యం సేవించేందుకు డబ్బులు ఇవ్వలేదని భార్యపై భర్త దాడికి పాల్పడిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన నాగార్జున మద్యానికి బానిసై రోజూ భార్య నాగరత్నతో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవపడుతుండేవాడు. ఎప్పటిలాగే శనివారం అతడు మద్యం సేవించేందుకు భార్యను డబ్బులు డిమాండ్ చేశాడు. ఇందుకు నిరాకరించడంతో ఆగ్రహించిన భర్త ఆమెపై దాడి చేశాడు. దాడిలో నాగరత్న తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చెట్లతో నిండిపోయిన మహిళా డాక్టర్ల భవనం


నిరుపయోగంగా ఉన్న వైద్యాధికారి భవనం

విని'యోగం' ఏదీ?

- రూ.4.40 కోట్లతో 'మెడికల్ కాలేజీ' భవనాల నిర్మాణం
- ఎనిమిదేళ్లవుతున్నా తలుపులు తెరచుకోని వైనం

ఆత్మకూరు: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల శిక్షణ, వసతి, వైద్యాధికారులు, సిబ్బంది నివాసాల కోసం ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో నిర్మించిన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈ భవనాల కోసం రూ.4.40 కోట్లు వెచ్చించారు. 2017వ సంవత్సరంలో లాంఛనంగా భవనాలు ప్రారంభించారు. అంతే ఆ మరుసటి రోజు నుంచి ఆ భవనాల తలుపులు తెరిచేవారే లేరు. ఏళ్లతరబడి పట్టించుకోకపోవడంతో భవనాల చుట్టూ పెద్ద పెద్ద చెట్లు, ముళ్ల కంపలు పెరిగిపోయాయి. భవనాల్లో పిల్లులు, పావురాలు చేరుకున్నాయి. వాటి శబ్దాలతో ఆ ప్రాంతం ప్రతిధ్వనిస్తోంది. అపరిశుభ్రతతో పరిసరాలు అధ్వానంగా మారాయి. భవనాలను ఉపయోగిస్తే వైద్య కళాశాల విద్యార్థులకు ఉపయోగపడతాయి. డాక్టర్లు రాత్రి వేళ కూడా స్థానికంగానే ఉండి.. అత్యవసర సమయాల్లో వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాత్రి పూట ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఆత్మకూరు ఆస్పత్రి డాక్టర్ సబిహా సుల్తానాను వివరణ కోరగా.. ఈ భవనాలు వైద్య కళాశాల ఆధీనంలోనే ఉన్నాయన్నారు. భవనాల వినియోగంపై తమకు ఎలాంటి అనుమతులూ రాలేదని స్పష్టం చేశారు.


ముళ్ల కంపలతో నిండిన పారామెడికల్ సిబ్బంది భవనం


నిరుపయోగంగా ఉన్న పురుష డాక్టర్ల వసతి గృహం

కమనీయం.. కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూరు: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. తొలుత శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించి పట్టు వస్త్రాలు,బంగారు ఆభరణాలు ధరింపజేశారు. అనంతరం పండితుల మంత్రాల నడుమ పసుపు, కుంకుమ కలిపిన అక్షితలతో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు చేసి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అంజన్నకు పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఆత్మకూరు: శ్రావణ శనివారం సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాల అనంతరం ఆకుపూజ చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

సమస్యలు పరిష్కరించండి

అనంతపురం క్రైం: అనంతపురం ఆర్టీసీ బస్టాండుతో పాటు డిపోలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కార్మిక సంఘాల నేతలు కోరారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే వచ్చారు. ఆయన్ను కార్మిక సంఘాల నేతలు కలసి తమ సమస్యలు విన్నవించారు. బస్టాండు ప్రాంగణం దారుణంగా ఉందని, గుంతలకు నిలయంగా మారిందని తెలిపారు. బస్టాండు నుంచి బయటకు వెళ్లే దారి పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు.

ఫైనల్‌కు చేరిన జార్ఖండ్

అనంతపురం: జాతీయ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో జార్ఖండ్ జట్టు ఫైనల్‌కు చేరింది. ఆర్డీటీ స్టేడియంలో శనివారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో జార్ఖండ్ 1-0 గోల్ తేడాతో తమిళనాడును ఓడించింది. ఆదివారం నుంచి గ్రూప్-బీ, గ్రూప్-డీ లీగ్ దశ పోటీలు జరగనున్నాయి. ఇందులో ఒక జట్టు ఫైనల్‌కు చేరి జార్ఖండ్‌తో తలపడనుంది.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో శుక్రవారం రాత్రి ఓ యువకుడు అప్పులబాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొలిమి రామాంజనేయులు (29) అనే యువకుడు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల కొత్త ఇంటి నిర్మాణం కోసం ఇతరుల వద్ద రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పులు ఇచ్చిన వారు ఇంటి వద్దకు వచ్చి అప్పు చెల్లించాలని అడుగుతుంటే దంపతులు గొడవపడేవారు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక రామాంజనేయులు గ్రామ సమీపంలోని హెచ్చెల్సీ కాలువలో లుంగీతో కంప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ నరేష్ తెలిపారు.

ఆ నటనకు వన్స్‌మోర్!

- పౌరాణిక నాటకాల్లో రాణిస్తున్న ఉక్కడం రవి
- ఖ్యాతి తెచ్చిన మాయల ఫక్కీర్, వీరబాహుడి పాత్రలు


వీరబాహుడు వేషంలో రవి


స్టేజి మీద మాయలమరాఠి పాత్రలో నటిస్తున్న రవి

చెన్నేకొత్తపల్లి: ఆయన వేషం కడితే రంగస్థలం దద్దరిల్లుతుంది. ఆ అభినయ విశేషానికి ఎవరైనా ఫిదా కావాల్సిందే. పాత్రకు తగిన శరీక సౌష్టవంతో తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఆయనే... ఉక్కడం రవి. చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల పంచాయతీ సుబ్బరాయనిపల్లికి చెందిన రవి... పదో తరగతి వరకూ చదువుకున్నారు. పౌరాణిక నాటకాలంటే అమితాసక్తి కలిగిన ఆయన చిరుప్రాయం నుంచే వీధి నాటకాల్లో నటిస్తూ వచ్చారు.

ప్రజా కళాకారుడిగా...

ప్రజాగాయకుడు గద్దర్ వద్ద గాయకుడిగా శిక్షణ తీసుకున్న ఆయన అభ్యుదయ భావజాలంతో సమాజంలోని పలు రుగ్మతలను పారదోలేందుకు శ్రమిస్తూ వచ్చారు. ఓ ప్రజా కళాకారుడిగా ఎదిగిన రవి... అనంతరం కళాకారులతో కలసి అంటరానితనం నిర్మూలన, వరకట్న దురాచారం, మహిళా వేధింపులు, సామాన్య ప్రజల కష్టాలు, రైతు ఆత్మహత్యలు, ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వీధి నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేశారు. ఈ క్రమంలోనే రంగస్థలంపై మక్కువ పెంచుకున్నారు. మాయల మరాఠి (బాలనాగమ్మ), వీరబాహుడు (సత్యహరిశ్చంద్ర), భీముడు, దుర్యోధనుడు తదితర పాత్రల్లో తనదైన అభినయంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆధునిక సాంకేతికత కారణంగా సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్లు పెరిగి పౌరాణిక నాటకాలకు ఆదరణ తగ్గుతోందని, ఇలాంటి తరుణంలో కళాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని ఆయన కోరుతున్నారు.

ఘనంగా శ్రావణ ఉత్సవాలు


పూజలందుకున్న శ్రీనివాసుడు


పూజలు చేస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి ఆశ్రమంలో శ్రావణ మాసోత్సవాలు ఘనంగా జరిగాయి. తొలి శ్రావణ శనివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తాదులు తరలి వచ్చి స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. ఉదయం వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం, తులసి అర్చన, అద్దుపడి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మధ్యాహ్నం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని పలు వైష్ణవాలయాల్లోనూ శ్రావణ శనివారం పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.

సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ


సేంద్రియ ఎరువు తయారు చేయిస్తున్న టింబక్టు సిబ్బంది

చెన్నేకొత్తపల్లి: సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించడంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీ విధానంపై రైతులకు టింబక్టు కలెక్టివ్ సంస్థ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. కనుముక్కల గ్రామంలో శనివారం సేంద్రియ వ్యవసాయం కో ఆర్డినేటర్ సన్నప్పయ్య ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కో ఆర్డినేటర్ మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వలన భూమి సారవంతాన్ని కోల్పోతుందన్నారు. రసాయన ఎరువుల ద్వారా వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. దీంతో టింబక్టు కలెక్టివ్ సంస్థ సేంద్రియ ఎరువుల ద్వారా పంటలను పండించే విధంగా రైతులకు అవగాహన కల్పిస్తోందన్నారు. అనంతరం భూసారాన్ని పెంచే పంచగవ్య, జీవామృతం, ఘన జీవామృతం, పుల్లటి మజ్జిగ కషాయాలు తయారు చేయించారు. అనంతరం రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ నీటి వాడకం పద్ధతులపై రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు నారాయణస్వామి, ముత్యాలయ్య, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు హరినాథరెడ్డి, కల్పన పలువురు రైతులు పాల్గొన్నారు.

కొత్త బస్సులు కొన్నది గత ప్రభుత్వ హయాంలోనే

- వైఎస్సార్‌సీపీ ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే 2,500 కొత్త ఆర్టీసీ బస్సులు కొన్నారని ఆ పార్టీ ఐటీ సెల్ జిల్లా అధ్యక్షులు వై.రాజశేకరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో 1,500 ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు, 1,000 ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ డిపోల వారీగా కేటాయింపులు కూడా జరిగిపోయాయన్నారు. నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థను ప్రభుత్వ పరం చేసి లాభాల బాట పట్టించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆర్టీసీ నష్టపోయిందని రవాణాశాఖ మంత్రి ఆరోపించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉచిత బస్సు ప్రయాణం హామీని నిలబెట్టుకోవాలని సూచించారు. రవాణాశాఖ మంత్రి ఏవైనా ఆధారాలతో సహా అడిగితే ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వరరెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి చేయూత


నాగేంద్ర కుటుంబానికి ఆర్థికసాయం, సరుకులు అందజేస్తున్న మిత్ర బృందం

కనగానపల్లి: కష్టాల్లో ఉన్న స్నేహితుని కుటుంబానికి చేయూతనందించారు. మండల కేంద్రం కనగానపల్లికి చెందిన సాకే నాగేంద్ర ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో అతని భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలు దిక్కులేనివారయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొన్న నాగేంద్ర బాల్య మిత్రులు బట్టా రాజేష్ ఆధ్వర్యంలో శనివారం స్నేహితుని కుటుంబాన్ని పరామర్శించారు. తర్వాతా రూ.10 వేల నగదు, బియ్యం ప్యాకెట్, నిత్యావసర సరుకులు, పిల్లలకు అవసరమైన వస్తువులు, తినుబండారాలు అందించారు. కార్యక్రమంలో బోయ పాటి శ్రీకాంత్, అంకె హరి, బట్టా శివ, తదితరులు పాల్గొన్నారు.